సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 30 । జనవరి । 2023



ఆనంద సాగరం

మొగల్తూరు : కేపీపాలెం బీచ్‌కు ఆదివారం అధిక సంఖ్యలో విద్యార్థులు, యువత తరలివచ్చారు. సముద్ర స్నానాలు చేసి ఉల్లాసంగా గడిపారు.



వనదేవతకు వందనం

బుట్టాయగూడెం: కామవరం సమీపంలోని అటవీ ప్రాంతంలో కొలువైన గుబ్బల మంగమ్మ తల్లి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయంలో విశేష పూజలు జరిగాయి.

విశేష అలంకరణ



పెనుగొండ: పెనుగొండ వాసవీ శాంతి థాంలో పంచలోహ విగ్రహ ప్రతిష్ఠాపన నాల్గో వార్షికోత్సవాల్లో భాగంగా అమ్మవారిని విశేషంగా అలంకరించారు.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా కో–ఆర్డినేటర్ల పరీక్ష



పరీక్షల తీరును పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

పెదపాడు: మండల స్థాయి కో–ఆర్డినేటర్ల పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని జెడ్పీ సీఈఓ రవికుమార్ అధికారులను ఆదేశించారు. మండలంలోని వట్లూరు రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో ఆదివారం జరిగిన మండల కో–ఆర్డినేటర్ పరీక్షలను ఆయన తనిఖీ చేశారు. పరీక్షల తీరును పరిశీలించి కేంద్రం నిర్వాహకులకు సూచనలు చేశారు. జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు, పంచాయతీ కార్యదర్శి మేకా శ్రీనివాస్ ఉన్నారు.

నేడు 'స్పందన'

భీమవరం(ప్రకాశంచౌక్): భీమవరం కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని కలెక్టర్ పి.ప్రశాంతి ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే జిల్లాలోని డివిజనల్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లోనూ స్పందన నిర్వహిస్తారని పేర్కొన్నారు. అర్జీదారులు కోవిడ్ నిబంధనలు పాటించాలని సూచించారు.

నేడు జగనన్న చేదోడు

ఏలూరు(మెట్రో): రాష్ట్రవ్యాప్తంగా 3,30,014 మంది రజక, నాయీబ్రాహ్మణ, దర్జీలకు జగనన్న చేదోడు పథకం కింద రూ.330.14 కోట్ల ఆర్థిక సాయాన్ని సీఎం జగన్ సోమవారం అందించనున్నారు. పల్నాడు జిల్లా వినుకొండ వేదికగా ఖాతాల్లో నగదు జమ చేయనున్నారు.

భూసర్వే అద్వితీయం

జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష

- ముమ్మరంగా ఫేజ్–2 పనులు
- 9 మండలాల్లోని 133 గ్రామాల్లో సర్వే
- 2.70 లక్షల ఎకరాల్లో సర్వే లక్ష్యం
- అధునాతన పరికరాల వినియోగం



వీరవాసరంలో డ్రోన్‌తో సర్వే

భీమవరం(ప్రకాశం చౌక్): రాష్ట్రంలో భూవివాదాల పరిష్కారమే లక్ష్యంగా సమగ్ర హద్దులు నిర్ధారించి హక్కు పత్రాలు అందించేలా ప్రభుత్వం జగనన్న భూహక్కు–భూరక్ష పథకాన్ని ప్రవేశపెట్టి పకడ్బందీ అమలుచేస్తోంది. దీనిలో భాగంగా భూములను రీ సర్వే చేసి సరైన హద్దులు, విస్తరణతో కూడిన హక్కు పత్రాలను రైతులకు అందిస్తున్నారు. జిల్లాలో ఈ కార్యక్రమం విజయవంతంగా సాగుతోంది. ఇప్పటికే మొదటి విడతగా 16 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టి రీసర్వేను పూర్తిచేశారు. ప్రస్తుతం ఫేజ్–2లో భాగంగా జిల్లాలో 9 మండలాల్లోని 133 గ్రామాల్లో భూముల రీ సర్వే చురుగ్గా సాగుతోంది. వ్యవసాయ, ప్రభుత్వ, ప్రైవేట్ భూములన్నింటినీ రీ సర్వే చేస్తున్నారు. సర్వే, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు ఈ పనుల్లో నిమగ్నమయ్యారు.

13 గ్రామాల్లో డ్రోన్ ఫ్లై పూర్తి

జిల్లాలోని భీమవరం డివిజన్‌లోని 9 మండలాల్లోని 133 గ్రామాల్లో 2,70,232 ఎకరాల్లో రీ సర్వే లక్ష్యం కాగా ఇప్పటివరకూ 13 గ్రామాల్లో డ్రోన్‌ఫ్లై పూర్తి చేశారు. మిగిలిన గ్రామాల్లో డ్రోన్‌ఫ్లై పనులు జరుగుతుండగా, ఈ పనులు పూర్తయిన గ్రామాల్లో భూ సర్వేకు సంబంధించి మిగిలిన ప్రక్రియ చేపట్టారు.

ఆధునిక పరికరాలతో..

భూముల రీ సర్వే కోసం అధికారులు ఆధునిక పరికరాలను వినియోగిస్తున్నారు. భూముల గుర్తింపు కోసం డ్రోన్, ఆర్థోరెక్టిఫైడ్ ఇమేజ్, రోవర్ వంటి పరికరాలను వాడుతున్నారు. మండల సర్వేయర్, విలేజ్ సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది బృందంగా ఏర్పడి సర్వే చేస్తున్నారు. సర్వే చేసిన భూముల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేసి ల్యాండ్, సర్వే విభాగం వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నారు. సర్వేలో హై ఎండ్ డ్రోన్లు 3, రోవర్స్ 30, హై బేస్ పాయింట్స్ 2, ఈటీఎస్‌లు 20 పరికరాలను వినియోగిస్తున్నారు.

కలెక్టర్ ప్రత్యేక పర్యవేక్షణ

జిల్లాలో భూముల రీ సర్వే పనులపై కలెక్టర్ పి.ప్రశాంతి ప్రత్యేక దృష్టి సారించారు. ఆమె స్వయంగా భూముల రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో పర్యటిస్తూ సర్వే తీరును పరిశీలిస్తున్నారు. అలాగే సిబ్బందికి సూచనలు, ఆదేశాలు ఇస్తూ పనులు పక్కాగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే జాయింట్ కలెక్టర్ జేవీ మురళీ, ల్యాండ్ అండ్ సర్వే శాఖ జిల్లా అధికారి కూడా పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. పనులను వేగంగా జరిగేలా పర్యవేక్షిస్తున్నారు.

సర్వే ఇలా..

మండలం	గ్రామాలు		
భీమవరం	9	ఉండి	20
పాలకోడేరు	14	కాళ్ల	13
వీరవాసరం	14	అత్తిలి	14
ఆకివీడు	12	పెంటపాడు	21
		తాడేపల్లిగూడెం	16

వేగంగా సర్వే పనులు



భూహక్కు–భూరక్ష పత్రాల్లో తప్పులుంటే రైతులు మండలంలో ఉండే మొబైల్ మెజిస్ట్రేట్‌కు దరఖాస్తు చేసుకుంటే సమస్య పరిష్కారిస్తారు. జిల్లాలో ఫేజ్–2 సర్వే కోసం 380 మంది సర్వేయర్లు, 20 మంది సర్వే అసిస్టెంట్లు, 500 మంది రెవెన్యూ అధికారులు, మొబైల్ మేజిస్ట్రేట్‌లు పనిచేస్తున్నారు. రీ సర్వే పూర్తి అయిన గ్రామాలకు సంబంధించి ఎప్పటికప్పుడు భూహక్కు పత్రాలు రైతులకు అందించడానికి, వేగంగా రీ సర్వే పూర్తి చేయడానికి చర్యలు తీసుకున్నాం.

– పి.ప్రశాంతి, కలెక్టర్

హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

గ్రామాల్లోని వ్యవసాయ, గ్రామ కంఠం, ప్రైవేట్ భూములను ఉచితంగా రీ సర్వే చేసి, కచ్చితమైన విస్తరణతో భూములను చూపించి వాటికి సంబంధించి హక్కు పత్రాలు అందించడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీని ద్వారా భూ సమస్యలు, వివాదాలకు సీఎం జగన్ చెక్ పెడుతున్నారని అంటున్నారు.

16 గ్రామాల్లో పూర్తయిన సర్వే

జిల్లాలో తొలి విడతలో 16 మండలాల్లోని 16 గ్రామాల్లో సుమారు 2 వేల ఎకరాల భూముల రీసర్వే పూర్తయ్యింది. 6,187 మంది రైతులకు 5,656 జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పత్రాలు అందించారు.

దాతల సహకారం అభినందనీయం



నోటు పుస్తకాలు అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

సాక్షి, భీమవరం: ప్రతి విద్యార్థి చదువుకుని ఉజ్వల భవిష్యత్‌ను అందిపుచ్చుకోవాలని, దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు నోట్ పుస్తకాలను కలెక్టర్ చేతులమీదుగా అందించారు. సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అందిస్తున్న సహకారం అద్వితీయమని కలెక్టర్ కొనియాడారు. అనంతరం భీమవరం ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎస్ శ్రీకర్, చీఫ్ అడ్వయిజర్ కేసీ రాజు, జిల్లా లీగల్ అడ్వయిజర్ ఎన్.భాస్కరరావు, విగ్రహ కమిటీ సభ్యులు కుమార్, వై.ఏసుబాబు, రాజబాబు, ఎంఎం కాళీ పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): అపరిష్కృతంగా రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్న ఆకివీడు, కాళ్ల మండలాల్లో భూ రీ సర్వే పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఓ ప్రకటనలో ఆదేశించారు. భూ కమిషనర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆయా మండలాలకు అవసరమైన సర్వేయర్లు, సిబ్బంది, రోవర్‌లు, డ్రోన్‌లను కేటాయించాలని సంబంధిత అధికారులను కోరారు. నిర్ణీత సమయంలోపు రీ సర్వే పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సూచించారు.

వట్టికి కన్నీటి వీడ్కోలు

- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అభిమానుల నివాళులు



వట్టి వసంతకుమార్ (ఫైల్)



పార్థీవదేహం వద్ద కన్నీటి పర్యంతమవుతున్న తండ్రి పార్థసారథి

భీమడోలు/ఉంగుటూరు: ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, నిగర్వి డాక్టర్ వట్టి వసంతకుమార్ (69) ఆదివారం వేకువ జామున కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నాలుగు రోజుల క్రితం విశాఖలోని అపోలో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన పార్థీవదేహాన్ని విశాఖ నుంచి స్వగ్రామం పూళ్ల పంచాయతీ ఎంఎం పురం గ్రామానికి ప్రత్యేక అంబులెన్స్‌లో తరలించారు. అప్పటికే పెద్ద ఎత్తున అభిమానులు, నాయకులు, కార్యకర్తలు, రాజకీయ నేతలు తరలి వచ్చారు. శోకతప్త హృదయాలతో ఆ ప్రాంగణమంతా నిండిపోయింది.

సీఎం జగన్ ప్రగాఢ సంతాపం

రాష్ట్ర ప్రభుత్వం అధికార లాంఛనాలతో వసంతకుమార్ పార్థీవదేహానికి అంత్యక్రియలు చేసేలా ప్రభుత్వం జీఓ జారీ చేసిందని, ఆ కుటుంబానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రగాఢ సంతాపాన్ని తెలిపినట్టు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తెలిపారు. అంత్యక్రియల నిర్వహణ బాధ్యతను తనతో పాటు రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజాకు అప్పగించారని అన్నారు.

ప్రముఖుల నివాళి

వసంతకుమార్ పార్థీవదేహం వద్ద పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, రోడ్డు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, రాజ్యసభ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్యేలు ఆళ్ల నాని, పుప్పాల వాసుబాబు, వైఎస్సార్ సీపీ నేత గోకరాజు రామరాజు, మాజీ మంత్రి రఘువీరారెడ్డి, మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణ్ కుమార్, కేవీపీ రామచంద్రరావు, సినీ నిర్మాత అల్లు అరవింద్, మాజీ ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ, గన్ని వీరాంజనేయులు, ఈలి నాని, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, కొఠారు రామచంద్రరావు తదితరులు నివాళులర్పించారు.

ప్రభుత్వ లాంఛనాలతో..

వసంతకుమార్ పార్థీవదేహాన్ని జనవాహిని నడుమ గ్రామంలోని ఆయన వ్యవసాయ క్షేత్రానికి తీసుకువెళ్లి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు చేశారు. తండ్రి పార్థసారథి ఆయన పార్థీవదేహం వద్ద కన్నీటి పర్యంతమయ్యారు.



ప్రభుత్వ అధికార లాంఛనాలతో వసంతకుమార్ అంత్యక్రియలు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

2004, 2009 ఎన్నికల్లో ఉంగుటూరు ఎమ్మెల్యేగా వట్టి వసంతకుమార్ అత్యధిక మెజార్టీగా గెలుపొందారు. వైఎస్సార్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి కేబినెట్‌లలో మంత్రిగా పనిచేశారు. పదేళ్ల కాలంలో ముగ్గురు ముఖ్యమంత్రులను పూళ్ల గ్రామానికి తీసుకుని వచ్చి ఉంగుటూరు నియోజకవర్గంలో మంచినీరు, రహదారులు, బస్టాండ్ల సమస్యల పరిష్కారానికి నిధులు తీసుకువచ్చారు. గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేసిన సమయంలో మైక్రో ఫైనాన్స్ అగడాలను అడ్డుకునేలా చట్టం తెచ్చారు.

2014 నుంచి రాజకీయాలకు దూరం

కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా రాష్ట్రాన్ని విభజన చేయడంతో కలత చెందిన వసంతకుమార్ 2014 ఎన్నికల్లో రాజకీయాలకు దూరంగా ఉన్నారు. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ, టీడీపీకి మద్దతు ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. అనంతరం భార్య మృతి చెందడంతో అప్పటినుంచి రాజకీయాలకు దూరంగా ఉంటూ విశాఖలో నివసిస్తున్నారు. ఈ సమయంలో పొలిటికల్ విభాగంలో ఆంధ్రా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందారు.

విద్యార్థి దశ నుంచి..

డీసీసీబీ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ వట్టి వెంకట రంగ పార్థసారథి ద్వితీయ కుమారుడు వసంతకుమార్. ఆయన అగ్రికల్చర్ బీఎస్సీ, ఎంబీఏ పూర్తిచేసి 1978–81లో అధ్యాపకుడిగా పనిచేశారు. విద్యార్థి దశ నుంచే ఆయన రాజకీయాల్లో చురుగ్గా వ్యవహరించేవారు. మహారాష్ట్ర అకోలా వర్సిటీ విద్యార్థి సంఘ అధ్యక్షుడిగా, 1973–76లో యూత్ కాంగ్రెస్ కన్వీనర్‌గా పనిచేశారు. 1989–90లో పీసీసీ సంయుక్త కార్యదర్శిగా వ్యవహరించారు. ఉత్తమ ఆక్వా రైతు అవార్డు, మెరైన్ ప్రొడక్ట్స్ అండ్ ఎగుమతులు అభివృద్ధి అథారిటీ సభ్యుడిగా, ఏపీ ఆక్వా రైతుల అసోసియేషన్ అధ్యక్షుడిగా వివిధ హోదాల్లో పనిచేశారు. 2004లో ఉంగుటూరు నుంచి తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దివంగత సీఎం వైఎస్సార్‌తో సన్నిహిత సంబంధాలు ఉండటంతో రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. వసంత్‌కుమార్ తాత పసల సూర్యచంద్రరావు 1952లో అలంపురం నియోజకవర్గం ఎమ్మెల్యేగా పనిచేసి ఉప సభాపతిగా కూడా వ్యవహరించారు. వసంత్ తండ్రి పార్థసారథి జిల్లాలో సీనియర్ రాజకీయవేత్త కాగా డీసీసీబీ చైర్మన్‌గా సేవలందించారు.

ప్రగాఢ సంతాపం

వట్టి వసంత్‌కుమార్ మృతి తీరని లోటని, ఆయన కుటుంబానికి మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, కొట్టు సత్యనారాయణ, దాడిశెట్టి రాజా, ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యేలు ఆళ్ల నాని, పుప్పాల వాసుబాబు, గ్రంధి శ్రీనివాస్, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు తదితరులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాజకీయాల్లో మచ్చలేని నాయకుడిగా, అవినీతికి తావులేకుండా అందరి హృదయాల్లో వసంతకుమార్ నిలిచిపోయారన్నారు. ఉంగుటూరు నియోజకవర్గంతో పాటు జిల్లా అభివృద్ధికి విశేషంగా కృషిచేశారన్నారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.









నివాళులర్పిస్తున్న ఎంపీ బోస్, ఎమ్మెల్యే ఆళ్ల నాని, కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మంత్రి కారుమూరి, ఎంపీ కోటగిరి, నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గురుకుల పాఠశాలల క్రీడాపోటీలు ప్రారంభం

26 జిల్లాల నుంచి 800 మంది రాక

సింహాచలం (విశాఖ): విద్యార్థుల్లో జాతీయతా భావం, ఐకమత్యం, పోటీతత్వం అలవరచడానికి క్రీడా పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. మహాత్మా జ్యోతి బాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో సింహాచలంలోని గురుకుల పాఠశాల వేదికగా ఆదివారం రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లోని బీసీ గురుకుల పాఠశాలల నుంచి 800 మంది క్రీడాకారులు హాజరయ్యారు. గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణమోహన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 102 బీసీ గురుకులాల్లో 35 వేల మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. విద్యా విషయాల్లోనే కాకుండా క్రీడల్లో కూడా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడల ద్వారా శారీరకంగా, మానసికంగా ఆరోగ్యం పెంపొందుతుందన్నారు. తొలుత జిల్లాల వారీగా క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. ఇక్కడ 12 రకాల స్పోర్ట్స్, 8 రకాల గేమ్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.

ఆకట్టుకున్న విన్యాసాలు

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల సందర్భంగా ప్రారంభ వేడుకల్లో ఆయా పాఠశాలలు, కళాశాలల నుంచి వచ్చిన క్రీడాకారులు చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి. వందన సమర్పణను విశేషంగా క్రీడాకారులు నిర్వహించారు.

తొలిరోజు ఉత్సాహంగా..

తొలి రోజు జరిగిన 800 మీటర్ల పరుగు పోటీలో బాలుర విభాగంలో బి.ప్రశాంత్ (చిత్తూరు), టి.యుగంధర్(శ్రీకాకుళం), వి.మణికంఠ కుమార్ (నెల్లూరు) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. 800 మీటర్ల బాలికల విభాగంలో బి.శ్రీవాణి (కర్నూలు), బి.హర్షిత (శ్రీకాకుళం), జి.భవ్యశ్రీ (అనంతపురం) తొలి మూడు స్థానాల్లో నిలిచారు. కబడ్డీ పోటీలు ఉత్కంఠగా సాగాయి.





నమో నారసింహా

ఆగిరిపల్లిలోని శోభనగిరిపై శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహ స్వామివారి రథసప్తమి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. స్థానిక పెద్ద కొఠాయి (స్వామివారి కల్యాణ మండపం)లో శనివారం అర్ధరాత్రి స్వామి కల్యాణాన్ని జరిపించారు. ఉదయం స్వామి, అమ్మవార్లను రథంపై ఆశీనులు గావించి రథోత్సవాన్ని ప్రారంభించారు. రథోత్సవం కల్యాణ మండపం మీదుగా దమ్మన్న మండపం, వెంకటాచల మండపం, పొగడచెట్ల మండపం మధ్య ఉన్న నాలుగు వీధుల్లో అశేష జనవాహిని నడుమ సాగింది. రథోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాట భజనలు ఆకట్టుకున్నాయి. సీఐలు అంకబాబు, మూర్తి, తహసీల్దార్ ఉదయభాస్కరరావు, ఆలయ ఈఓ ఎస్.భవాని ఏర్పాట్లను పర్యవేక్షించారు. పొన్నం వెంకట లక్ష్మణరావు వారి సోదరులు రథ అలంకరణకు సహకరించారు. అద్దంకి శివసత్యనారాయణ సోదరులు, వారి బృందం రథ సారథులుగా వ్యవహరించారు. ఎస్సై ఎస్.చంటిబాబు, సిబ్బంది బందోబస్తు చేశారు.

– ఆగిరిపల్లి

మావుళ్లమ్మ సన్నిధిలో సన్మానం అదృష్టం

సినీనటుడు జేడీ చక్రవర్తి

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మావుళ్లమ్మ తల్లి సన్నిధిలో సన్మానం పొందడం అదృష్టంగా భావిస్తున్నానని సినీ నటుడు జేడీ చక్రవర్తి అన్నారు. అమ్మవారి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి నీరుల్లి, కూరగాయ, పండ్ల వర్తక సంఘం, మావుళ్లమ్మ ఉత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో కొటికలపూడి గోవిందరావు కళావేదికపై జేడీ చక్రవర్తిని నిర్వాహకులు సువర్ణ హస్త కంకణంతో ఘనంగా సన్మానించారు. ముందుగా జేడీ చక్రవర్తి అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేయించారు. సన్మాన సభలో ఆయన మాట్లాడుతూ అమ్మవారిని దర్శించుకోవటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఎంతో పుణ్యం చేసుకుంటేనే అమ్మవారి సన్నిధిలో సన్మానం పొందుతామన్నారు. అమ్మవారి ఉత్సవాలను ఏటా ఘనంగా నిర్వహిస్తున్న నిర్వాహకులకు అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయన్నారు. సినిమాల్లో తనను ఆదరించిన తెలుగు ప్రేక్షకులకు ఎన్నటికీ రుణపడి ఉంటానన్నారు. డాక్టర్ చీడే సత్యనారాయణ, డాక్టర్ వేగిరాజు రామకృష్ణంరాజు, నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, దేవస్థానం, చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు ఆలయ అధికారులు పాల్గొన్నారు.



సినీనటుడు జేడీ చక్రవర్తిని సన్మానిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

ఫెన్సింగ్‌లో రామరాజుకు కాంస్యం


ఫెన్సింగ్ పోటీలలో బహుమతి అందుకుంటున్న రామరాజు

సాక్షి, భీమవరం: జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలలో భీమవరం పట్టణానికి చెందిన మంతెన రామరాజు కాంస్య పతకం సాధించినట్లు ఫెన్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.కృష్ణమోహన్ ఆదివారం విలేకరులకు చెప్పారు. ఈ నెల 27, 28 తేదీలలో థాయిలాండ్‌లో నిర్వహించిన మెహూన్ ఫెన్సింగ్–మినీ ఫెన్సింగ్ పోటీలలో రామరాజు తృతీయ స్థానం సాధించి బహుమతి పొందినట్లు కృష్ణమోహన్ తెలిపారు.

దాడిలో నలుగురికి గాయాలు

నూజివీడు: స్థలం సరిహద్దు వివాదంలో ఒక వర్గం మరో వర్గంపై దాడి చేయడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అన్నవరానికి చెందిన మందపాటి ఏడుకొండలు, కొలుసు రాంబాబులకు స్థలం సరిహద్దు విషయంలో గొడవ ఉంది. ఈ నెల 28న రాత్రి కొలుసు రాంబాబు, సాంబశివరావు, రాంబాబు భార్య శివపార్వతి ఇంటి వద్ద కూర్చుని ఉండగా, ఏడుకొండలు, అతని భార్య వెంకటేశ్వరమ్మ, చిన్న కొడుకు రవి, మందపాటి వెంకటేశ్వరరావులు దాడిచేశారు. ఈ దాడిలో రాంబాబు తల్లి సోమేశ్వరమ్మ తల పగిలి తీవ్ర గాయమైంది. క్షతగాత్రులు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శివపార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శీతాకాలం.. ఆక్వాకు గడ్డుకాలం

- చలిగాలుల తీవ్రతతో రొయ్యకు వైరస్‌ల వ్యాప్తి
- ఈహెచ్‌పీ, ఆక్సిజన్ శాతం తగ్గుదలతో నష్టం


రొయ్యల చెరువులో ఏరియేటర్స్ ఉపయోగిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: ఆక్వా రైతులకు శీతాకాలం గడ్డుకాలంగా మారింది. ప్రస్తుతం చలుగాలుల తీవ్రత ఎక్కువగా ఉండడంతో రొయ్యలకు వైరస్ వ్యాపించి తెగుళ్ల బారిన పడుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సీజన్లో ప్రధానంగా వైట్ స్పాట్, వైట్‌గట్ తెగుళ్లతోపాటు ఈహెచ్‌పీ, ఆక్సిజన్ లెవిల్స్ తగ్గిపోవడంతో రొయ్యలు చనిపోతున్నాయని వాపోతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 1.20 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు. గత ఏడాది రొయ్యల ధరలు గణనీయంగా తగ్గిపోవడంతో రైతులు నష్టాలబాట పట్టారు. దీంతో రొయ్యల రైతుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా మంత్రులు, అధికారులతో సాధికారిత కమిటీ నియమించి రొయ్యల ధరలు తగ్గకుండా కనీస ధరలకు వ్యాపారులు కొనుగోలు చేసేలా, రొయ్యల మేతల ధరలు కూడా తగ్గించేలా చర్యలు తీసుకోవాలంటూ ఆదేశించారు. దీంతో సాధికారిత కమిటీ రొయ్యల రైతులు, కొనుగోలుదారులు, సీడ్ హేచరీ యజమానులు, ఫీడ్ కంపెనీ ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి రొయ్యలు 100 కౌంట్ కనీసం రూ.210 తగ్గకుండా కొనుగోలు చేయాలని, ఫీడ్ ధరను కిలో రూ.2.60 తగ్గించడంతోపాటు సీడ్ 30 పైసలకే సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నారు. దీనితో రైతులు ఆనందం వ్యక్తం చేయడంతోపాటు గతంలో సాగును విరమించుకున్న రైతులు సైతం సాగుబాట పట్టారు. ఇటీవల రొయ్యల ధరలు పెరుగుతూ 100 కౌంట్ కిలో రూ.240 వరకు పలుకుతోంది.

జాగ్రత్తలు తీసుకోవాలి

ఏటా శీతాకాలం రొయ్య రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వివిధ రకాల వైరస్ వల్ల రొయ్యలు తెగుళ్లబారిన పడి చనిపోతుంటాయి. సకాలంలో జాగ్రత్తలు తీసుకోకపోతే రైతు తీవ్రంగా నష్టపోక తప్పడం లేదు. వైట్‌స్పాట్, వైట్ గట్, తెగుళ్లు, శిలీంద్రం ద్వారా రొయ్యలకు వ్యాధులు సోకుతున్నాయి. వైరస్ కావడంతో పక్కపక్క చెరువులకు వ్యాప్తిచెందే అవకాశం ఎక్కువ. వైరస్ సోకిన రొయ్యలు మేత సరిగా తినకుండా చెరువు పైభాగంలో తిరుగుతూ ఉంటాయి. దీనితో రొయ్య ఎదుగుదల ఆగిపోతుంది. దీంతో నిత్యం చెరువులో నీటిని పరీక్ష చేయించి ట్రేల ద్వారా మేతను అందిస్తూ పరిశీలించాలి. అలాగే చెరువుల్లో ఉష్ణోగ్రత తగ్గిపోవడంతో ఆక్సిజన్ లెవెల్స్ తగ్గి రొయ్యలకు ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతుంది. దీనికిగాను ఏరియేటర్లను ఉపయోగించుకోవాలి.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



శీతాకాలం ఆక్వా సాగులో సమస్యలు తప్పవు. సరైన జాగ్రత్తలు పాటిస్తే సాగులో నష్టాలు లేకుండా కాపాడుకోవచ్చును. వైట్ స్పాట్, వైట్‌గట్ తెగుళ్లతోపాటు ఈపీహెచ్‌పీ తగ్గిపోవడం ఈ సీజన్‌లో కనిపిస్తుంటాయి. దీనికిగాను చెరువులో సీడ్ తక్కువగా వేసుకోవడంతోపాటు మేతలు విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ఉష్ణోగ్రతల మెయింటెనెన్స్ కోసం ఏరియేటర్స్ ఉపయోగించుకోవాలి.

– ఎల్ఎల్ఎన్ రాజు, మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, భీమవరం

వాటర్ ట్యాంక్ పైనుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన వీర నారాయణస్వామి

బొండపల్లి: మద్యం తాగి ఆరోగ్యం పాడు చేసుకోవద్దని నచ్చచెప్పాలని భార్య ప్రయత్నించగా.. భర్త మనస్తాపానికి గురై వాటర్ ట్యాంక్‌పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విజయనగరం జిల్లా బొండపల్లి మండలంలోని గొల్లుపాలెంలో ఆదివారం ఈ సంఘటన జరిగింది. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం, కైకరం గ్రామానికి చెందిన దార్ల వీర నారాయణస్వామి(37) బతుకుదెరువు కోసం గొల్లుపాలెం వచ్చి కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. ఆరు నెలల క్రితం స్వగ్రామానికి వెళ్లి అక్కడ పనులు చేస్తూ వ్యసనాలకు బానిసయ్యాడు. తిరిగి గొల్లుపాలెం వచ్చిన నారాయణ స్వామి మద్యం తాగుతూ కాలక్షేపం చేసేవాడు. మద్యం తాగవద్దని రెండు రోజుల క్రితం భార్య చెప్పడంతో మనస్తాపానికి గురై గ్రామంలోని ఎస్సీ కాలనీ వద్ద గల వాటర్ ట్యాంకు పైకి ఎక్కి దూకేశాడు. పై నుంచి దూకడంతో తీవ్ర గాయాల పాలైన నారాయణ స్వామిని గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగ అరెస్టు


తణుకులో వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఆంజనేయులు

తణుకు: తాళం వేసిన ఇళ్లు లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్న నిందితుడ్ని ఆదివారం తణుకు రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవలి జరిగిన చోరీలపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు పెనుగొండ మండలం బాబూజీపురం గ్రామానికి చెందిన తానేటి ఆశీర్వాదంను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో అరెస్టు చేసి అతని వద్ద మొత్తం మూడు కేసుల్లో 990 గ్రాముల వెండి వస్తువులతోపాటు ఒక పల్సర్ మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు తణుకు రూరల్ సీఐ సీహెచ్ ఆంజనేయులు వివరాలు వెల్లడించారు. నిందితుడు ఆశీర్వాదంపై మొత్తం 20పైగా కేసులు నమోదు అయినట్లు చెప్పారు. పెనుగొండ పోలీసు స్టేషన్ పరిధిలో సస్పెక్టెడ్ షీట్ ఉన్నట్లు సీఐ వెల్లడించారు. తాళం వేసిన ఇళ్లు లక్ష్యంగా చేసుకుని పగలు సమయాల్లో రెక్కి నిర్వహించి తాళాలు పగలగొట్టి చోరీలకు పాల్పడతాడని చెప్పారు. ఈ కేసులో సహకరించిన ఎస్సై కె.గుర్రయ్య, ఏఎస్సై ఎం.గోవిందరావు, హెడ్‌కానిస్టేబుల్ కె.వి.సుబ్బారావు, కానిస్టేబుళ్లు అన్వర్, అక్బర్, మహేష్‌లను సీఐ ఆంజనేయులు అభినందించారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో శిక్షణ


హ్యాండ్‌బాల్ పోటీలకు వెళ్ళే జట్టు

దెందులూరు: మండలంలోని వేగవరం హేలాపురి ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం సౌత్ జోన్ హ్యాండ్ బాల్ పోటీలకు వెళ్ళే ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ జట్టు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. మంగళవారం తమిళనాడు సేలంలో జరిగే సౌత్ జోన్ పోటీలకు యూనివర్సిటీ జట్టు విద్యార్థులు పాల్గొంటారని వర్సిటీ అబ్జర్వర్ టీ.సాల్మన్ కరుణానిధి అన్నారు. గత పది రోజులుగా వీరికి నిపుణులు శిక్షణ ఇస్తున్నారు.

కరాటే పోటీల్లో ఆరు పతకాలు


మార్షల్ ఆర్ట్స్‌లో పతకాలు అందుకున్న ఆకివీడు విద్యార్థులు

ఆకివీడు: రాష్ట్ర స్థాయి ఓపెన్ కుంగ్‌ఫు అండ్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో ఆకివీడు కేశవ్ షోటోఖాన్ కరాటే అకాడమీ విద్యార్థులు ఆరు బంగారు, వెండి పతకాల్ని పొందారు. ఏలూరు జిల్లా హనుమాన్ జంక్షన్‌లో ఆదివారంతీ పోటీలు జరిగినట్లు కరాటే మాస్టర్ గంటా శ్రీను చెప్పారు. పోటీల్లో గంటా షైనీ, ఎస్.నాగ చరణ్, వై.పార్థు, ఎస్.భార్గవ్, వి.నాగేందర్, జీ.అక్షయ్, జీ.సాత్విక్, సీహెచ్ అభినవ్ జాయ్‌లు పతకాలు సాధించారని తెలిపారు.

వృద్ధుడికి తీవ్ర గాయాలు

సాక్షి, భీమవరం: స్థానిక రెస్ట్‌హౌస్ రోడ్డులోని ఒక భవనం వద్ద టైలర్ అప్పారావు(70) రక్తపు మడుగులో ఉండడాన్ని గమనించి ఆస్పత్రికి తరలించారు. టైలరింగ్ కోసం వచ్చిన వారు చూసి వృద్ధుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లారు.

చెట్టుకు ఢీకొని వ్యక్తి మృతి


మృతుడు దూలం రాజా రమేష్(36)

భీమడోలు: భీమడోలు రైల్వే స్టేషన్ సమీపంలోని జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదానికి గురైన దూలం రాజా రమేష్(36) మృతి చెందాడు. తాడేపల్లిగూడెంకు చెందిన దూలం రాజా రమేష్ శీతల పానీయాల వ్యాపారం చేసేవాడు. ఈ నెల 28న శనివారం తన బుల్లెట్‌పై ఏలూరు వెళ్లి తిరిగి అదే రోజు సాయంత్రం ఇంటికి వస్తుండగా భీమడోలు రైల్వే స్టేషన్ వద్దకు వచ్చేసరికి ఒక్కసారిగా బైక్ అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లోని చెట్టుకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజారమేష్‌కు తలకు బలమైన గాయాలై స్పృహ కోల్పోయాడు. ఎవరూ గమనించకపోవడంతో ఆదివారం మధ్యాహ్నం ప్రాణాలు విడిచి మృతి చెందాడు. భీమడోలుకు చెందిన తోట మురళీకృష్ణ అనే వ్యక్తి రోడ్డు పక్కనే ఉన్న మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుని సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై చావా సురేష్‌కుమార్ తెలిపారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

తణుకు: తాను ప్రేమించిన యువతికి వేరొకరితో వివాహం కావడంతో మనస్తాపం చెందిన యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. తణుకు రైల్వే అవుట్ పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. పెనుమంట్ర గ్రామానికి చెందిన మారోజు వెంకటేష్ (27) తణుకులో పాలిటెక్నిక్ విద్య పూర్తి చేసి విశాఖపట్నంలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. సుమారు ఆరున్నరేళ్ల క్రితం ఒక యువతిని ప్రేమించాడు. ఆమెకు మరొకరితో వివాహం చేయడంతో అప్పటి నుంచి మనస్తాపం చెందిన వెంకటేష్ మానసికంగా కృంగిపోయాడు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు వెంకటేష్‌కు చికిత్స ఇప్పిస్తున్నారు. శనివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన వెంకటేష్ తిరిగి రాకపోవడంతో ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలో అత్తిలి, మంచిలి రైల్వే స్టేషన్ల మధ్య యువకుడి మృతదేహాన్ని గుర్తించిన రైల్వే పోలీసులు అతని వద్ద లభ్యమైన సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. తండ్రి వీరబ్రహ్మం ఫిర్యాదు మేరకు భీమవరం రైల్వే ఎస్సై పీటీవీ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వివాహిత ఆత్మహత్య

పెదవేగి : కడుపునొప్పికి తాళలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిందని పెదవేగి ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొప్పాక గ్రామానికి చెందిన నాగేండ్ల రాముడుకి అమ్మపాలెంకు చెందిన బెజవాడ మౌనికతో 15 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. మౌనికకు తరచూ కడుపులో నొప్పి వస్తుండటంతో ఈ నెల 28 రాత్రి బాధ తాళలేక ఇంటి వద్ద పురుగుల మందు తాగింది. ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మౌనిక (35) మృతి చెందినట్లు తెలిపారు.

గుట్కా ఇవ్వలేదని యువకుడి హత్య


హత్యకు గురైన బాణావతు ఏసు

నూజివీడు: గుట్కా ప్యాకెట్ ఇవ్వనందుకు మండలంలోని హటియాతండా వద్ద ఆదివారం సాయంత్రం యువకుడిని మరో యువకుడు కత్తితో హత్య చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హటియాతండాకు చెందిన లావూరి యువరాజు(25) అలియాస్ పోరియా గ్రామానికి సమీపంలోని కొత్తూరు తండాకు చెందిన బాణావతు ఏసు(25) అలియాస్ హిల్లేను సాయంత్రం 5 గంటల సమయంలో కత్తితో పొడవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఏసుని గుట్కా ప్యాకెట్ ఇవ్వమని యువరాజు అడగగా, తిరస్కరించడంతో ఏసును పొడవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు వెంటనే పోలీసులకు తెలియజేశారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. సీఐ ఆర్.అంకబాబు, రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. నిందితుడు యువరాజు పరారయ్యాడు. గతంలో కూడా యువరాజు మద్యం మత్తులో ప్రతి ఒక్కరితో గొడవపడటం, రాళ్లు విసరడం చేస్తూ అందరితో కొట్లాటకు దిగేవాడని, జేబులో ఎప్పుడూ చాకు పెట్టుకొని తిరుగుతాడని స్థానికులు తెలిపారు. ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేయగా, సిఐ అంకబాబు దర్యాప్తు చేస్తున్నారు.

వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య


మృతురాలు సౌందర్య

పెదపాడు: గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పెదపాడు మండలంలోని గుడిపాడులో చోటుచేటుకుంది. పెదపాడు మండలంలోని గుడిపాడుకు చెందిన రాపాక సనాతన పనికి వెళ్లి ఇంటికి వచ్చేసరికి భార్య సౌందర్య ఉరివేసుకుని ఉండటాన్ని గమనించి వెంటనే పెదపాడు పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే పెదపాడు ఎస్సై సంఘటన స్థలానికి చేరుకుని మృతురాలు రాసిన లెటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తిని దేవదాసు రాజేష్‌గా గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుని ఇంటి ముందు మృతదేహాన్ని ఉంచి గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. దీంతో పెదపాడు పోలీసులు వారిని సముదాయించి పంపారు.

మేత బస్తాల చోరీపై కేసు నమోదు

పాలకోడేరు: రొయ్యల చెరువు వద్ద ఉంచిన మేత బస్తాలు అపహరణకు గురైన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మైప గ్రామంలో రొయ్యల చెరువు వద్ద ఉంచిన మేత బస్తాలు శనివారం గుర్తుతెలియని దుండగులు అపహరించుకుపోయారు. దీనిపై చెరువు యజమాని ఏడుకొండలు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సిహెచ్ఎస్ రామచంద్ర తెలిపారు

మేత బస్తాలు దొంగిలించారని ఫిర్యాదు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రొయ్యల చెరువు వద్ద మేత బస్తాలు దొంగిలించారంటూ ఆక్వా రైతు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఉండి గ్రామానికి చెందిన మోపిదేవి నాగ శ్రీనివాస్ తోకతిప్ప గ్రామంలో 15 ఎకరాలు చేపలు, రొయ్యల చెరువు సాగు చేస్తున్నాడు. గతేడాది డిసెంబర్ 29న చెరువు వద్ద 26 రొయ్యల మేత బస్తాలు ఉంచగా తెల్లవారుజామున చూసేసరికి ఎవరో గుర్తు తెలియని దొంగలు దొంగిలించారని వాటి విలువ రూ.36 వేలు ఉంటుందని మోపిదేవి నాగ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఎస్సై వి.అప్పలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మన్ కీ బాత్‌లో పాల్గొన్న సోము వీర్రాజు


మన్ కీ బాత్‌లో భాగంగా గిలకల గేటు వద్ద కార్యక్రమంలో పాల్గొన్న సోము వీర్రాజు

ఏలూరు (టూటౌన్): ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఆదివారం పాల్గొన్నారు. స్థానిక పవరుపేటలోని గిలకలగేటు సమీపంలో సెంట్రల్ మండల అధ్యక్షుడు బాడిత నారాయణరావు ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి కోట్ని పార్వతి ఇంటి వద్ద మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆయన వీక్షించారు. ప్రత్యేక అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొర్లపాటి సుధాకర్ కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రధానమంత్రి స్ఫూర్తివంతమైన పనులు చేస్తున్న వ్యక్తుల గురించి ప్రస్తావించారన్నారు. కార్యక్రమంలో నూకాలమ్మ గుడి శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మన్ కీ బాత్ కార్యక్రమం అనంతరం సోము వీర్రాజు స్థానిక సెంట్రల్ మండల కమిటీ అధ్యక్షుడు బాడిత నారాయణరావు ఇంటికి వెళ్లారు.

మామిడి పూత కోసం పాట్లు

విచ్చలవిడిగా రసాయనాల పిచికారీ

పాడి - పంట


పూత కోసం మామిడి చెట్లకు మందు స్ప్రే చేస్తున్న రైతులు

నూజివీడు: ప్రకృతి మామిడి రైతుల్ని కరుణించడం లేదు. నూజివీడు డివిజన్‌లోని రైతులు ఈ ఏడాది మామిడిపై ఎన్నో ఆశలు పెట్టుకోగా పూత మాత్రం ఆశించిన విధంగా లేదు. డిసెంబరు, జనవరి నెల మొదటి వారంలో రావాల్సిన మామిడిపూతలు జనవరి నెలాఖరు వచ్చినా అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఈ ప్రాంతంలో ప్రధాన వాణిజ్య పంటగా ఉన్న మామిడిపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. మామూలుగా వర్షాకాలంలో కురిసిన వర్షాలకు అక్టోబర్ నెలలో తోటలలో ఇగురువచ్చి డిసెంబరు రెండో పక్షం నుంచి పూతలు కనిపిస్తాయి. డివిజన్‌లోని నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి, చింతలపూడి, లింగపాలెం మండలాల్లో కలిపి దాదాపు 60 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. సరైన సమయంలో తోటలు పూత పూయకపోతే దిగుబడిపై ప్రభావం ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది పూతలు ఇంకా రాకపోవడానికి వాతావరణం అనుకూలంగా లేకపోవడమేనని రైతులు అంటున్నారు. కొన్నిచోట్ల ముదురు పూత పిందెగా మారకుండానే మాడిపోయింది. ఈ ప్రాంతంలో బంగినపల్లి, కలెక్టర్(తోతాపురం), చిన్నరసాలు, పెద్దరసాల తోటలు విస్తరించి ఉన్నాయి.

పూతల కోసం రసాయనాల పిచికారీ

మామిడి పూతల కోసం రైతులు రసాయనాలు పిచికారీ చేస్తున్నారు. మామిడి పంట సాధారణంగా బెట్ట పంట. అక్టోబర్ నుంచి తోట బెట్టకు వచ్చినట్లయితే డిసెంబరులో పూతలు వస్తాయి. గతేడాది కంటే ఈ ఏడాది పూతలు తక్కువగానే ఉన్నాయని రైతులు చెబుతున్నారు. ప్రతికూల వాతావరణం ఎదురవుతున్నందున పూతలు తక్కువ వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. వేలాది రూపాయల పెట్టుబడులు పెడుతూ ఒక్కోరైతు రెండు నుంచి ఆరుసార్ల వరకు రసాయనాలు పిచికారీ చేశారు. అయినా పూత జాడ కనిపించడం లేదు. దీంతో పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. తోటను కాపుకు కొనుగోలు చేసిన వారు పూత కోసం విచక్షణారహితగా మందులు పిచికారీ చేస్తుండటం గమనార్హం.

పూతలు తక్కువగా ఉన్నాయి



ఈ ఏడాది మామిడి పూతలు ప్రస్తుతానికి తక్కువగానే ఉన్నాయి. దీంతో మామిడి సీజన్ రైతులకు ఆశాజనకంగా లేదు. ముదురు పూత పిందె కాకుండా మాడిపోయింది. పూతల కోసం రైతులు, వ్యాపారులు మామిడి తోటలకు రసాయనాలు పిచికారీ చేస్తున్నారు. ఈ విధంగా చేయడం వల్ల పెట్టుబడి పెరుగుతోంది.

శీలం రాము, మామిడి రైతు, నూజివీడు

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన



వేల్పూరులో అవగాహన కల్పిస్తున్న సీఐ ఆంజనేయులు

తణుకు: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తణుకు రూరల్ సీఐ సీహెచ్ ఆంజనేయులు కోరారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఆదివారం తణుకు మండలం వేల్పూరులో వాహనదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వాహనదారులు తప్పనిసరిగా నియమ నిబంధనలు పాటించాలని కోరారు. మోటారు సైకిల్‌పై ప్రయాణించే వారు కచ్చితంగా హెల్మెట్ వినియోగించాలని సీఐ సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐతోపాటు రూరల్ ఎస్సై కె.గుర్రయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిబ్రవరి 5 నుంచి ఉరుసు ఉత్సవాలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం హజరత్ కాలే మస్తాన్ షాఔలియా దర్గాలో ఫిబ్రవరి 5 నుంచి 7వ తేదీ వరకు ఉరుసు మహోత్సవాలు నిర్వహించనున్నట్టు దర్గా పోషకురాలు అబ్బిన నాగమణి తెలిపారు. 5న ఘుమ్మాస్‌పై సందల్ (గంధం) పూయడం, 6న సాయంత్రం గుర్రంపై సందల్ ఉత్సవం, 7న దీపాల మహోత్సవం, విద్యార్థులకు బహుమతుల ప్రదానం కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వివరించారు. ఉరుసు మహోత్సవాల్లో సకల జనులు పాల్గొని జయప్రదం చేయాలని ఆమె కోరారు.

31న వాహనాలకు బహిరంగ వేలం

తణుకు: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలోని పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 31న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు సీఐ ఆర్.సత్యవతి తెలిపారు. ఉదయం 11 గంటలకు స్టేషన్ ఆవరణలో నిర్వహించనున్న బహిరంగ వేలంలో ఔత్సాహికులు పాల్గొనవచ్చని చెప్పారు. వేలంపాటలో పాల్గొనే ఆసక్తిదారులు రూ. 5 వేలు డిపాజిట్ చెల్లించి ఆధార్, పాన్‌కార్డు జెరాక్సు కాపీలు అందజేయాలని కోరారు.

సంక్షేమ హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): సంక్షేమ హాస్టల్స్ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం సోషల్ వెల్ఫేర్ హాస్టల్ వద్ద నిర్వహించిన సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.వాసు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పతివాడ నాగేంద్రబాబు, తాడికొండ రవి బాబు హాజరై మాట్లాడుతూ హాస్టల్స్‌లో మెస్ ఛార్జీలను పెంచాలని, హాస్టళ్లకు అవసరమైన సిబ్బందిని పెంచాలని, తదితర సమస్యలను ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధాని మన్ కీ బాత్ వీక్షించిన బీజేపీ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించిన మాట మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం పట్టణంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ శక్తి కేంద్రంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నరిశే సోమేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు వీక్షించారు. ఈ సందర్భంగా నరిశే మాట్లాడుతూ వ్యర్థాలలో 17 ధాతువులను సేకరించడం, రీ స్ట్రైకింగ్ ద్వారా పెద్ద కంపెనీలకు సరఫరా చేయడం, పద్మశ్రీ అవార్డులు, వన్య ప్రాణులు తదితర అంశాలు ప్రధాని మన్‌కీ బాత్‌లో చర్చకు వచ్చాయని వెల్లడించారు. బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగం జగపతి రామయ్య, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు నీలాద్రిపురంలో 'గడపగడపకు'

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నీలాద్రిపురంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు వెలిశెట్టి నరేంద్రకుమార్ తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, అధికారులు, పార్టీశ్రేణులు పాల్గొనాలని కోరారు.

నేడు మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమాలు

సాక్షి, భీమవరం: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో సోమవారం కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు ఆదివారం తెలిపారు. గాంధీ విగ్రహాల వద్ద సర్వమత ప్రార్థనలు, శాంతి ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. అదే విధంగా పెదనిండ్రకొలను మహాత్మాగాంధీ భవనంలో 11 గంటలకు గాంధీ మ్యూజియాన్ని ప్రారంభించి గాంధీ జీవిత అంశాలపై ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తామన్నారు. మల్లవరం ఆనంద్ నికేతన్ గాంధీ ఆశ్రమంలో గాంధేయంపై కవితా సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ధాన్యం సొమ్ము జమ.. రైతుల హర్షం



ఏలేటిపాడులో రైతులు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న రైతులు, నాయకులు

ఇరగవరం: రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి, సకాలంలో వారి ఖాతాల్లో ధాన్యం సొమ్ము జమ చేయడంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆదివారం ఇరగవరం మండలం ఏలేటిపాడులో రైతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ దళారీ వ్యవస్థ లేకుండా ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం తాలూకా సొమ్ము సకాలంలో ప్రభుత్వం తమ బ్యాంకు ఖాతాలకు జమ చేసారన్నారు. గతంలో మాదిరిగా దళారీ వ్యవస్థ లేకుండా రైతుకు, మిల్లర్లకు సంబంధం లేకుండా అమలుచేస్తున్న కొత్త విధానం ఎంతో సౌకర్యంగా ఉందని చెప్పారు. నూతన విధానం ద్వారా సకాలంలో ధాన్యం డబ్బు మాత్రమే కాకుండా ట్రాన్స్‌పోర్ట్, సంచుల తాలూకా సొమ్ముతోపాటు హమాలీ కూలీ జమ అయ్యాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చోడే జోషి, ఎంపీటీసీ సభ్యుడు కొవ్వూరి శ్రీనివాసురెడ్డి, ఇరగవరం మండలం జేసీఎస్ కన్వీనర్ మేడపాటి శ్రీరామదినేష్‌రెడ్డి, మల్లిడి విజయ భాస్కరరెడ్డి, నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రాణ త్యాగంతో లోకానికి శాంతి మార్గం



ప్రవచనకారుడు నండూరు శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ గోవిందరాజులు

పెనుగొండ: హింసకు తావివ్వకుండా ప్రాణత్యాగాన్ని చేసి లోకానికి శాంతి మార్గాన్ని చూపి వాసవీ కన్యకపరమేశ్వరి విశ్వమాత అని కర్ణాటక రాష్ట్రం బెంగుళూరుకు చెందిన ప్రముఖ ప్రవచన కారుడు నండూరు శ్రీనివాస్ అన్నారు. వాసవీ శాంతిధాంలోని పంచలో విగ్రహ ప్రతిష్టాపన నాలుగో వార్షికోత్సవాలు సందర్భంగా ఆదివారం వాసవీ మాతను దర్శించుకొని అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. విశ్వమంతటికి మాతగా జేజేలు అందుకుంటున్న వాసవీ మాత దర్శనం సకల శుభాలను ఇస్తోందన్నారు. వాసవీ జన్మస్థలమైన పెనుగొండలో 90 అడుగుల పంచలోహ విగ్రహం నెలకొల్పడం అభినందనీయమన్నారు. ఇంతటి విగ్రహం ప్రపంచంలో ఎక్కడా లేదన్నారు. దీంతో పెనుగొండలో అధ్యాత్మిక శోభ విరాజిల్లుతూ క్షేత్రంగా కొనియాడబడుతుందన్నారు. వాసవీ శాంతిధాంలో ప్రతిష్టాపన చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాల విశిష్టతను వివరించారు. అనంతరం అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గోవిందరాజులు నండూరి శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కోట్ల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కేఆర్ కృష్ణ, శిరిషా ఎస్.కుమార్, నార్కెడమిల్లి జనార్ధనరావులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల జాతర



కాళింగగూడెంలో జాతరలో జలాభిషేకానికి తరలివెళుతున్న మహిళలు

ఆకివీడు: మండలంలోని కాళింగగూడెంలో గంగానమ్మ, పెద్దింటి అమ్మవార్ల జాతర ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించి, అనంతరం గ్రామంలోని మహిళలు, ఆడపడుచులు బిందెలతో జలాన్ని తీసుకుని ప్రదర్శనగా ఆలయానికి చేరుకున్నారు. ముర్రాట పాడుకున్న బొడ్డుపల్లి అప్పనపల్లి కుటుంబం, బొడ్డుపల్లి శ్రీనివాస్ (గెటప్ శ్రీను) కుటుంబం తొలుత అమ్మవారికి జలాభిషేకం చేసి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మహిళలు బిందెలతో తీసుకువచ్చిన జలాన్ని అమ్మవార్లకు అభిషేకం చేశారు. ఈ సందర్భంగా అమ్మవార్లను దర్శించుకున్న పీవీఎల్ మాట్లాడుతూ ప్రజలు సుఖ సంతోషాలతో జీవించే విధంగా గ్రామదేవతల ఆశీస్సుల కోసం జాతరలు జరపడం ఆనవాయితీగా వస్తోందన్నారు. గ్రామ దేవతల్ని శాంతింపజేయడంతో చెడు ప్రభావాలు పోతాయన్నారు. అమ్మవార్ల ఆశీస్సులతో కొల్లేరు తీరంలోని కాళింగగూడెం దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. ముర్రాట పాడుకున్న గెటప్ శ్రీను మాట్లాడుతూ కొల్లేరు తీరంలో ఏటా వరదలకు ఈ ప్రాంతం జలమయమయ్యేదని చెప్పారు. శ్రీకాకుళం ప్రాంతం నుంచి వలస వచ్చిన కాళింగులంతా ఓల్డ్ వయ్యేరు కాలువ గట్టు ప్రాంతంలో నివసిస్తూ ఇక్కడ కాళింగగూడెంగా గ్రామాన్ని ఏర్పరుచుకున్నామని చెప్పారు. సుమారు 50 ఏళ్ల క్రితం వరదలకు పాడి పంటలే కాకుండా ప్రాణనష్టం కూడా జరుగుతుండటంతో ప్రజలు గంగానమ్మ, పెద్దింటి అమ్మను కొలుస్తూ వచ్చారు. ఏటా అమ్మవార్లకు పెద్ద ఎత్తున జాతర చేస్తుండటంతో గంగానమ్మ శాంతించిందని గెటప్ శ్రీను చెప్పారు. ఈ సందర్భంగా పీవీఎల్ నర్సింహరాజును, నాయకులను గ్రామానికి చెందిన మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కిల్లి రామకృష్ణ సత్కరించారు. గెటప్ శ్రీనును పీవీఎల్ సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గురువెల్లి అన్నపూర్ణ, ఎంపీటీసీ సభ్యులు బొడ్డుపల్లి రోహిణీ, హనుమంతు మధుసూదనరావు, సనపన నాగరాజు, మూల జగదీష్, గుంట వెంకటేశ్వరరావు, పమిడి వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు జగ్గురోతు విజయ్‌కుమార్, తంగి పుష్కరరావు, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, నంద్యాల సీతారామయ్య, గుండుగొలను ధనరాజు, జామి శ్రీనివాస్, షేక్ హుస్సేన్, తోట శివాజీ, చిట్టిబాబు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు
- యండగండిలో ఓహెచ్ఎస్ఆర్, ఫిల్టర్‌బెడ్, సంపుల నిర్మాణానికి శంకుస్థాపన

ఉండి: నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. ఆదివారం యండగండి గ్రామంలోని రెండో సచివాలయ పరిధిలో గ్రామ సర్పంచ్ గోగులమండ చినకృష్ణమూర్తి ఆధ్వర్యంలో జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.64 లక్షల వ్యయంతో వాటర్ ట్యాంక్ (ఓహెచ్ఎస్ఆర్), ఫిల్టర్ బెడ్, సంపుల నిర్మాణానికి పీవీఎల్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చినకృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పీవీఎల్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని 70 గ్రామాల్లో ప్రజలకు ఎప్పుడు ఏది అవసరమవుతుందో ముందే తెలుసుకుని పరిష్కరిస్తున్నామన్నారు. అలాగే ఇతర సమస్యలను గ్రామ వలంటీర్లు, సచివాలయ అధికారుల ద్వారా వాటిని గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళుతున్నామన్నారు. ఆ వెంటనే వాటి పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో పరిష్కరిస్తున్నామన్నారు. దీనిలో భాగంగానే గ్రామాల్లో అవసరమైన మేరకు వాటర్‌ట్యాంక్‌లు, ఫిల్టర్‌బెడ్‌లు, పైపులైన్ విస్తరణ, శివారు ప్రాంతాలకు తాగునీటి సరఫరా వంటివాటిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అంతే కాకుండా జగనన్న లేఅవుట్లలో నిర్మాణమైన ఇళ్లకు కూడా తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. అలాగే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ప్రజలు తమ దృష్టికి తెచ్చిన సమస్యలపై అధికారులు అప్పటికప్పుడు పరిష్కార మార్గాలు చూపిస్తున్నారని అన్నారు.

జాతీయస్థాయిలో వ్యాస రచనలకు ఆహ్వానం

పెంటపాడు: తెలుగు సాహిత్యం, కథలు, కవిత్వాలపై విద్యార్థులకు పూర్తి అవగాహన ఉండాలని పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్యాంబాబు పేర్కొన్నారు. ఫిబ్రవరిలో మాతృభాషా దినోత్సవం పురస్కరించుకొని డిగ్రీ, పీజీ విద్యార్థులకు అవగాహన కోసం జాతీయస్థాయి వ్యాసాలు రాసేందుకు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. తెలుగు సామాజిక పత్రిక అయిన ప్రకాశిక, పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సందర్భంగా 10 అత్యుత్తమ వ్యాసాలకు రూ.1000 నగదు ప్రోత్సాహం, అభినందన సత్కారంతో పాటు, 50 వ్యాసాలను ఎంపిక చేసి పుస్తక రూపంలో ప్రచురిస్తామన్నారు. వ్యాసాలను ఫిబ్రవరి 15లోపు పంపాలన్నారు. పూర్తి వివరాలకు పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగంలో లేదా సెల్ నం. 94926 38547ను సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ

పెంటపాడు: గూడెంలోని హౌసింగ్‌బోర్డు ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల బాలుర వసతిగృహంలో ఆదివారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు నిర్వహించారు. హాస్టల్ వెల్ఫేర్ అధికారులు నారాయణరావు, పి.రాము ఆధ్వర్యంలో పెంటపాడుకు చెందిన మానవత జిల్లా నాయకులు, పూర్వపు ఆంధ్రాబ్యాంక్ మేనేజర్ తాడేపల్లి మోహనరావు విద్యార్థులకు జ్ఞాపకశక్తి, ప్రణాళికాబద్ధంగా చదువుకునేందుకు, పరీక్షలపై భయం పోగొట్టేందుకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 60 మందికి పైగా వసతి గృహవిద్యార్థులు పాల్గొన్నారు.

31 నుంచి గోస్తనీ తీర్థోత్సవాలు

పాలకోడేరు: శ్రీ గోస్తనీ నది 92వ తీర్థోత్సవాలను ఈ నెల 31వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా 31వ తేదీ ఉదయం నుంచి ఏకాహం, భజనలు జరుగుతాయన్నారు. 1వ తేదీ ఉదయం నుంచి అల్లూరి సీతారామరాజు కుటుంబ సభ్యులతో కోదండరామ కల్యాణం, శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం, 10 గంటలకు కోలాటం, 11 గంటలకు అన్న సమారాధన రాత్రి 8 గంటలకు శ్రీ అల్లూరి సీతారామరాజు సినిమా ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు పేర్కొంది.

వట్టి వసంతకుమార్ మృతి తీరని లోటు



వట్టి వసంతకుమార్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న కొట్టు విశాల్

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాజీ మంత్రి వట్టి వసంతకుమార్ మృతి పట్ల వైఎస్సార్ సీపీ నేత, డిప్యూటీ సీఎం తనయుడు కొట్టు విశాల్ సంతాపం వ్యక్తం చేశారు. భీమడోలు మండలం మల్కిమహమ్మద్‌పురంలోని వట్టి నివాసానికి వెళ్లి వసంత్ భౌతికకాయాన్ని సందర్శించి ఆయన నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో నిజాయతీగా పనిచేసి ఎంతో మందికి సేవ చేసిన మహనీయుడు వసంత్ అని కొనియాడారు. గ్రామీణాభివృద్ధి, పర్యాటక శాఖ మంత్రిగా ప్రజల గుండెల్లో చెరదగని ముద్ర వేశారని తెలిపారు. వసంతకుమార్ ఆత్మకు శాంతి కలగాలని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఏపీయూడబ్ల్యూజే నివాళి

వసంతకుమార్ మృతికి ఏపీడబ్ల్యూజే సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు డి.సోమసుందర్ వసంత్ నివాసానికి వెళ్లి భౌతిక కాయాన్ని సందర్శించి, పూలమాల వేసి నివాళులర్పించారు. సోమసుందర్ మాట్లాడుతూ వైఎస్సార్ హయాంలో జర్నలిస్ట్ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడంలో ఏపీడబ్ల్యూజే చేసిన కృషికి వసంతకుమార్ నిరంతరం తోడ్పాటు అందించేవారని గుర్తు చేసుకున్నారు. ఆయన లేని లోటు తీర్చలేనిదని సంతాపం ప్రకటించారు. వసంత్ మృతికి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఈతకోట తాతాజీ సంతాపాన్ని తెలిపారు.

ఛాంబర్స్ కళాశాలలో మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్



ప్రశ్నాపత్రాలను విడుదల చేస్తున్న కళాశాల యాజమాన్యం

పాలకొల్లు సెంట్రల్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు భవిష్యత్‌లో వివిధ పోటీ పరీక్షలకు ఒక నమూనాగా ఈ మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్‌లు ఉపయోగపడతాయని కళాశాల చైర్మన్ కారుమూరి నరసింహరావు తెలిపారు. ఆదివారం బీఆర్ఆర్ అండ్ జీకేఆర్ డిగ్రీ అండ్ పీజీ ఛాంబర్స్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహరావు మాట్లాడుతూ ఇంటర్‌లో 90 శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు ఫీజులో పూర్తి రాయితీ ఇస్తామని అలాగే 85 శాతం మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు ఫీజులో 50 శాతం రాయితీని కల్పిస్తామని అన్నారు. అలాగే ఈ మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ ప్రోత్సాహకాలు సుమారు రెండు లక్షల రూపాయల వరకూ ఉంటాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ కళాశాలలో అత్యాధునికమైన లాబ్స్, ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధన, ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కలిదిండి రామరాజు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఓల్గా, ఛాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ దేవరపు లక్ష్మీనారాయణ, అకాడమిక్ అడ్వైజర్ ఏబిఎస్ మూర్తి, ఎస్ సీతారామారావు, ట్రెజరర్ జల్లూరి రామలింగేశ్వరరావు, వినుకొండ రంగారావు, మద్దుల కిరణ్, నెలకుర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పశువుల రక్షణకు యజమానులు బాధ్యత వహించాలి

పెంటపాడు: కలెక్టర్ పి. ప్రశాంతి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు అనారోగ్యంతో కదలలేని స్థితిలో ఉన్న పశువులను పెంటపాడు పశుసంవర్ధక శాఖ గుర్తిస్తోంది. రెండో రోజు ఆదివారం గూడెం రోడ్లపై సంచరిస్తున్న పలు పశువులను గుర్తించి తక్షణం వాటికి పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ విజయభాస్కర్ నేతృత్వంలో పశువైద్యులు జి. ప్రసాద్, యు. మణికంఠ తదితరులు వైద్యం అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహేష్ మాట్లాడుతూ పశువులను వాటి యజమానులు సంరక్షించకుండా ఇష్టాను సారంగా రోడ్లపై వదిలితే చర్యలు తప్పవన్నారు. రోడ్లు, మార్కెట్లు, సంతబజార్ తదితర ప్రాంతాల్లో సంచరించే ఆవులను గుర్తించి వాటి యజమానులతో మాట్లాడారు. ఇంటివద్దనే పశువులను ఉంచి వైద్యం చేయించుకోవాలన్నారు. పశువుల్లో ప్రబలే అంటురోగాలను నివారించుకోవడంతో పాటు, రహదారిపై ప్రమాదాలబారిన పడకుండా మూగజీవాలను సంరక్షించుకోవాలన్నారు.

వృద్ధులకు వైద్య సేవలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ఆదివారం 12 మందికి ఇంటివద్దే వైద్య సేవలు అందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. తణుకు పట్టణానికి చెందిన నేత్ర వైద్యులు హుస్సేన్ అహ్మద్, జనరల్ వైద్యులు బొండాడ వెంకటేశ్వర్లు సంచార వైద్యశాల ద్వారా తణుకు, సజ్జాపురం, పైడిపర్రు, వేల్పూరు తదితర ప్రాంతాల్లో పర్యటించి వృద్ధుల ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. పైడిపర్రుకు చెందిన సభ్యుడు అలుమోలు సుబ్బారావు ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులను ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాదికారి అర్జి భాస్కరరావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరం

భీమవరం (ప్రకాశం చౌక్): అమ్మవార్ల సన్నిధిలో భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. రజక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గునుపూడి గ్రామ దేవతలు ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ అమ్మవార్ల 32వ జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. జాతర ముగింపు సందర్భంగా ఆదివారం అమ్మవార్ల అలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మహా నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించారు. అనంతరం అన్నసమారాధనను ప్రారంభించి భక్తులకు వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించారన్నారు. అలాగే భక్తులకు అమ్మవారి ప్రసాదం అందించడం చాలా మంచి కార్యక్రమం అన్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికి ఉండాలని, అమ్మ దయతో అందరూ బాగుండాలని ఆకాంక్షించారు. అన్నసమారాధన దాత గొట్టుముక్కల వెంకటలక్ష్మి, తోట భోగయ్య, ఆలయ ఈవో జీఎస్ సీతారామరాజు, ఆలయ ధర్మకర్తలు, రజక యూత్ అసోసియేషన్, శ్రీ ఆదిలక్ష్మి రజక సంఘం నాయకులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీదుర్గాలక్ష్మి అమ్మవారి వార్షికోత్సవాలు ప్రారంభం

డీఎన్నార్ కళాశాల రోడ్డులోని కాలువ గట్టుపై వెలిసిన శ్రీదుర్గాలక్ష్మి అమ్మవారి 45వ వార్షికోత్సవాలను ఆదివారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవారాధన మించిన అనుభూతి మరొకటి లేదన్నారు. శ్రీదుర్గాలక్ష్మీ అమ్మవారి వార్షిక మహోత్సవాలను ఏటా మాదిరిగానే ఘనంగా నిర్వహించాలన్నారు. అమ్మవారిని దర్శించుకునే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆలయ ధర్మకర్తలు, అర్చకులు సత్కరించి అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈవో గొట్టుముక్కల సీతారామరాజు, చైర్మన్ పిప్పళ్ల సూర్యారావు, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు వాకా ఉదయ్‌కుమార్, తాడి వెంకటేశ్వరరెడ్డి, గండికోట వీరాస్వామి, పార్టీ నాయకులు రేవూరి గోగురాజు, తోట భోగయ్య, ముల్లి నరసింహమూర్తి, మానేపల్లి నాగేశ్వరరావు, గాదిరాజు సుబ్రహ్మణ్యంరాజు, కైలా పాండురంగారావు, ముత్యాల బుజ్జి, కోయ శ్రీరామమూర్తి, ఏపీపీ మారిశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం జరిపిస్తున్న ఆచార్యులు



సీతారాముల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్త జనసమూహం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక యడ్లబజారు సెంటర్ నందు కొలువై ఉన్న శ్రీ సీతారామ లక్ష్మణ సహిత పంచముఖ అంజనేయస్వామి ఆలయంలో రథసప్తమి పర్వదినం పురస్కరించుకుని శనివారం రాత్రి శ్రీ సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. హైదరాబాద్‌కు చెందిన ఆగమ పండితులు కొదమసింహం భరద్వాజ్ ఆచార్యుల యాజికంలో ముడుంబై వెంకటాచార్యులు సేవాకాలం, చక్రవర్తుల సంతోష్ కుమారాచార్యులు వ్యాఖ్యానం, నల్లాన్ చక్రవర్తుల వాసుదేవ ఫణిల గానంతో స్వామి వారి కల్యాణం జరిపించారు. స్వామి వారి కల్యాణం తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రధానార్చకులు రమణ, రఘుస్వాముల ఆధ్వర్యంలో శ్రీ సీతారామ కల్యాణ ఉత్సవ కమిటీ, శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి సేవా సమితి సభ్యులు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.